# ఉప్పాలం

కవికొండల వేంకటరావు

గుంటూరు, రేపల్లె, చీరాల, బందరు ఆ ప్రాంతపు సముద్రతీరపువంచకు "ఉప్పాలం"అని పేరు. చవుడు దేరి నేల మృదువుగా నుండి ఉప్పుజాడతో కూడుకొన్నదై చాల భాగము పెద్దబయలుగా తోస్తూ సిరు గాలి తోమ మైకంగా చల్లందనం, మన కనుతెప్ప లెగయ, గుప్పిస్తుంది. దూరదూరంగా ఎత్తైన సరుకుమొక్కలచాళ్లు తూగుతూ వినువాడెంతపరధ్యానంగా వున్నా తమసంగీతాన్ని వినిపిస్తూవుంటాయి. అక్కడక్కడ నివాసయోగ్యాలుగా భావించి మానవులు నిర్మించుకొన్న ఊళ్లు రెండుకోసుల్లో మూడుకోసుల్లో అడ్డదిడ్డపుతోవలతో అల్లుకుపోయి కనబడతాయి. ఆ గ్రామాదుల పేళ్లుకూడా సముద్రతీరప్రాంతాన్నిబట్టి పుట్టివుంటాయి అని అనుకొనేటట్టుగా — ఇసుకపల్లె, దిండి, కట్టవ, యిలా పిలవబడుతూవుంటాయి. కొండల్లో పుట్టి కొండల్లో పెరిగిన కోయవానికలాంటితా వొకటి భూమ్మీద వుంటుందా అని అనిపించకమానదు.

కట్టవ! అది ఒకానొకప్పుడు సముద్రానికి చెలియలికట్టగా పనిచేసి వుండాలి! దాని వీథుల్లోనికి నిసర్గమైన ఉప్పునీటివెల్లువ అంత ఎత్తు లేచిపడి ప్రవహించి వెనక్కు తగ్గి వుండాలి! కట్టవ! కుగ్రామం. ఒకటో రెండో వేపచెట్లు, రెండో, మూడో తాటిచెట్లు దాని గుర్తింపులు: పదిపదేను ఇళ్లు దానిసొంపులూ, వంపులూ కనిపింపులూను. చుట్టూ ఆరుదలబయలు. తెమలని తెలుపి. ఇప్పుడు దాన్ని మోసి ఏసముద్రమూ లేదు. సముద్రము దాన్ని విడిచిపెట్టి ఏనాడైందో! మానవు డెఱుగడు.

అయినా మిక్కిలి ముసిలిమానిసి వొకడు నా కగపిస్తూవున్నాడు, ఆవూరినుండి వెలువడి పెద్దబయలున నడుస్తూ. తలవెంట్రుకలూ కనుబొమ్మలూ నెరిసిపోయినయి. అయినప్పటికిన్నీ వానివొళ్లు భూచ్ఛాయలా నలుపు దేఱి, కళ్లల్లోని రక్తపుజీరలు అగ్నిజ్వాలల్లా కాంతిమీఱి, కాగి చల్లాఱనివ్యక్తిలా గగపించేడు.

"ఎందాకా పోతున్నావు? తాతా!" అన్నాను. "సముద్రపువంచకు" అన్నాడు. మఱి వొకరి కొకళ్లం మాట్లాడుకోకుండానే అతను ముందు నేను వెనక,అతను ముందు నేను వెనక, సన్ననిసందంట పోతూన్న మాదిరిగా నిబ్బరపుచూపుతో వెళ్లిపోతున్నాం.

కార్తి — కత్తిరి కొకింతపిదపో, రోహిణి కొకింతముందో చెప్పలేనుకాని, కాలం అప్పట్లో మండువేసంగి అనిమాత్రం చెప్పగలను. భూమేకాకుండ ఆకాశంకూడా కనకనమంటూవున్నట్టుగా వుండి కుతకుత ఉడికిపోతూ వుంది.

అంత ఎండలో, అంత మండువేసంగిలో ఎందు కానడక అంటే అత డేంచెప్పేవాడో!

నే నతణ్ణి అడగలేదు. కాని అతడు తనను దిరిగి నన్నడిగేడా నేను ఒక్కటేమాట చెప్పదలచుకొన్నాను. "నీవు నడుస్తున్నావు. నీ వెనకాలే నేడు నడవాలని నాకు బుద్ధిపుట్టింది. నేను నడుస్తున్నాను. నాకేమిన్నీ ఎండ కనిపించడంలేదు" అని ఘంటాపథంగా చెప్పదలచుకొన్నాను.

నిశ్శబ్దదేవత మమ్మల్నిద్దర్ని ఆ ఘడియ తనకు అనుచరులుగా గావించుకొని నడిపిస్తూవుంది. ఏలా మాటాడుకుంటాం పరస్పరం?

సూర్యునియొక్క ఏటవాలుకిరణాలు పగలాపైని జాం జాంన్నరకంటె ఎక్కువవుండనేరదని అనిపిస్తున్నాయి. నేలంట ఎండమావులు వ్యాప్తమై అక్కడికి సముద్రమనతిదూరం అన్నట్టు కంటికి తట్టిస్తున్నాయి.

ఆప్రాంతంలో సముద్రతీరాన్ని "ఉప్పాలం" అని ఏలా వాడుతారో "ఎండమావి"ని "అగ్గిపాలు" అని అనడం పరిపాటి. మేమిద్దఱం ఒక ఎండమావి దాటినాము. ఎండమావి దాటడమేమిటి? అది దానంతటదే మాముందు ఒత్తిగిలి వెనక్కు జరిగింది అని అనవచ్చును.

"అగ్గిపాల" ఒయ్యారం జగన్మోహనాకారం అని అనుకోండి. అవిగో నీళ్లన్నట్టుగా తోపిస్తూ నీళ్లు కనిపించవు. నీలనీలాంబుధిమల్లేనే ఆలోలంగా అగపిస్తుంది. కాని కెరటాలయొక్క హోరు శూన్యము.

మేం నడుస్తూన్నకొద్దీ ఎండమావిస్వరూపం అంతగా మారకపోయినా నేల మారింది. రయితు లక్కడక్కడ పండించి కోసికొన్న చోడిమళ్లు దాటి, ఉప్పుటేళ్ల వఱుపుపచ్చికకయిళ్ల నడవసాగినాము. అవి దాటి క్రమంగా యిసకమిట్టల కెక్కినాము. మిట్టలు మైదానంగా కొంతలెక్క నడిచినాము. ఆ మైదానపుటంచునే సరుగుతోపులు తంబురంయి సముద్రపుగాలికి వ్రాగిసలాడుతూ గోచరించినాయి. అంతటితో మఱిమృగతృష్ణలు రావని నేను వోనిర్ధారణకు వచ్చివేసినాను.

నాముందు నడుస్తూవున్న అతడు "సముద్రం అదిగో చూచినావా? దోరా!" అన్నాడు, ఉత్సాహపూరితుడై —. ఎందుకు అతని కంతసంతోషం కలగాలి ఆసముద్రం చూడగానే? అత డెందుకు తలపోయాలి సముద్రంచూడ్డానిగ్గాను, దారి తెలీక అతణ్ణి నేను వెంబడించినానని? అతడు నాకు మృగతృష్ణనే సముద్రంఅని చూపక సముద్రాన్నే సముద్రం అని ఎందుకు చూపించాలి? ఇలాగ్గా పరిపరివిధాలుగా ఆలోచింప దొడగింది నామనస్సు - వాని చూపుడు వ్రేలినే సముద్రాన్ని సందర్శిస్తూ.

గబుక్కున యిసకమైదానం దిగినట్టయింది. మాకాలికింద ఇసకంతా చెమ్మగిదనమే. తీరపుటిసకరేణువు ఏకమొత్తంగా కెరటాలదెబ్బలు తింటూ జిలజిల మంటూవుంది.

ఆసన్నని సున్నితపు తేమదేఱిన యిసకరేణువులమీద వేలకువేలుగా కోట్లకుకోట్లుగా ఎఱ్ఱపీతలు బాడితపూతల్లే విశ్రమించియున్నాయి!

సరిగా అదేముహూర్తం! భానుమండలం ఈశాన్యదిక్కుగా ఓ మేఘం జొచ్చి అందులోనుంచి క్రిందికి కోమూలకు సముద్ర

మున్ను నల్లని జీమూతంలాంటి సరుకుతోట యున్నా కలిసిపోయిన ట్టగపించే వాకానోక మలుపులోనికి, తన కాంతిపుంజాన్ని పింజె వోసి దిగజార్చినట్లు వాల్చింది. క్రమంగా బింబం మేఘం వెలువడి జారిపోతూ అపరిమిత మైన అరుణచ్ఛవిని విరాజిల్లింది. తాత్కా లికపు తుదిసంజయొక్క శాంతిప్రకాశం ధాత్రి నలముకొన్నదై ప్రత్యేకత నక్కడ ఆ ఎఱ్ఱపీతలయొక్క ఎఱ్ఱందనాన్ని ఇనుమ డింప జేస్తూవుంది.

"అలికిడి సేయకుండా రా! దొరా!" అన్నాడు తాత. "ఏం?" అన్నాను. "ఆ ఎఱ్ఱ పీతలన్నీ యిట్టే బొత్తల్లోదూరి మనకు మఱి దొఱకవు. నేను వాటికోసమే యింత దూరం నడిచివచ్చింది." అన్నాడు తాత. అంటూనే పొట్ట ముమ్మడతలు పడిపోయే ట్టుగా వొదిగి వంగి వాలి ఓ పీతచాయకు సాగిలబడి దాన్ని పట్టుకో చేతులు సాచి నాడు. పీత వాని గుప్పిట చిక్కింది. గుప్పిలి నొక్కడా? చచ్చిందే కటక్కని!

దాని సూదుల్లాంటి మిడిగ్రుడ్లు వాడి వ్రేళ్ల సందుల్లోనుంచి కనిపిస్తూ యింకా మూతలువడ్డం విడివడ్డం మానలేదు. దాని పదికాళ్లు పదికాళ్లుగానే వున్నాయి.

నేను వానితో "ఆచిన్న పీత నెందుకు పట్టుకు చంపుతావు? అదిగో ఆ పెద్దపీతను పట్టుకో" అని తప్పెట తట్టాను. నా ఆ తప్పె టతో తీరాన్ని వున్న సమస్తజీవరాసులు దాక్కుండిపోయినాయి. "సమస్త జీవరా సులు" అనడంలో అర్థముంది. వానిచేతిలోని చిన్నపీతకూడా, యాదాలాపంగా నామాట పుచ్చుకు ఆవృద్ధుడు విడిచిపెట్టడంవల్ల, స్వేచ్ఛను పొంది, చెంతనే ఓబొరియ చేసుకు మటుమాయమైంది; కాబట్టి "సమస్త జీవ రాసులు" అనడంలో అర్థ ముంది.

ముసిలివాడు నిర్ఘాంతు డౌతూ, ఆని ర్ఘాంతరూపంలోనే నిరాశ చూపుతూ "ఏది నివన్నపీత! అన్నింటినీ నీ తప్పెటచేత చెదర గొట్టినావు దొరా!" అన్నాడు.

"అదిగో! ఎఱ్ఱఎఱ్ఱగా — ఆ సరుకు మొక్కలున్నూ కెరటాలున్నూ మమైకంగా వున్న ఈశాన్యదిఙ్మండలంలోనికి చొఱుచుకు పోతూవున్నదే—అదే నేనన్నపీత. దాన్ని వెంటాడించు" అన్నాను.

"అది పీతగాదు దొరా! సూర్యభగ వానుడు! రోజూ అలా క్రుంకుతూనే వుం టాడు స్వామి! రోజూ ఆస్వామిని పట్టుకో బోయి పట్టుకోలేక ముందుకు పడి విఱిగి ముక్కలై పోతూనేవుంటుంది అలా ఆమూల ఆ కెరటం! ఎవ్వరికీ దొఱకని పెద్దపీత ఆ బింబం!" అన్నాడు నామాట మిక్కిలీ రెట్టించి అమ్మహావృద్ధు.

వాని ఆకలిడొక్క లింకా లోపలకు దించుకుపోతువున్నా "సముద్రాని కెంతతీరని ఆకలో!" అని ఉచ్చైశ్శ్రుతంగా అను కున్నాడు.

కడలికరళ్ల ప్రతిబింబించినట్లే అదయా ఘునికళ్ల నోనిమేషం సాయంసంధ్యారాగం ప్రతిఫలించింది. ఉప్పాలమంతా చిట్టిజాబిల్లి కితకితలెట్టినట్టు కిలకిలా నవ్వింది.